# పుల్లేరు కలుషితం



పుల్లేరు నుంచి వచ్చిన ఎడ్లకోడు కాల్వలో మురుగు నీరు

## ▸ విజయవాడ నుంచే మురుగు నీరు వస్తోంది : గుడ్లవల్లేరు వాసుల ఆవేదన

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 2** : కృష్ణా డెల్టాలో ప్రధాన సాగు, తాగునీటి కాల్వ లోయర్, అప్పర్ పుల్లేరులో కలుషిత నీరు ప్రవహిస్తోంది. ఈ నీరంతా విజయవాడ కాల్వల నుంచి వచ్చినదేనని స్థానికు లంటున్నారు. పుల్లేరు నుంచి నీరు వచ్చే పుల్లేటిగట్టు, పోల్‌రాజ్ కెనాల్‌ల దగ్గరకు వెళితే కనీసం ఐదు నిమిషాలు ఉండలేనంతగా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి కారణం పుల్లేరు నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరే. విజయవాడలో కాల్వల్లోకి ఔట్‌లెట్‌లు పెట్టడంతో ఆ నీరంతా ఇక్కడకు చేరుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది కొత్తేమీ కాకపోయినా నీటి పారుదల ఎక్కువగా ఉన్నప్పుడు ఆ నీటిలో కలిసి పోతోంది. కొన్ని రోజులుగా పై నుంచి నీరు వదలకపోయేసరికి బెజవాడ మురుగు నీరంతా కాల్వల ద్వారానే ప్రవహిస్తోంది. దీంతో కాల్వలో చేపలు చనిపోయి పైకి తేలుతున్నాయి. వీటి కారణంగా ఈ ప్రాంత తాగునీటి బావులు పాడయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కౌతవరం 1వ వార్డు పరిధిలో నివసించే వందలాది కుటుంబాలకు పుల్లేటి కాల్వ నీరే ఆధారం. ఈ నీరు తాగితే వ్యాధులు రావడం ఖాయమని స్థానికులు తెలిపారు. ఈ నీటిని పరిశీలించిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ స్టేట్ లీగ్ రిప్రజంటేటివ్, ఉమెన్స్ సెల్ ప్రెసిడెంట్ కెఎస్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు స్పందించారు. సాయంత్రానికి ఇరిగేషన్ ఇఇ వేణుగోపాల్ కాల్వ చూసి తాము చేసేది ఏమీ లేదని చెప్పారు. బాధితులంతా ప్రజా ప్రతినిధు లతో కలిసి విజయవాడ కార్పొరేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని చెప్పడం గమనార్హం. ఆ మురుగు అలానే పారితే దోమలు వృద్ధిచెంది ఏ అనర్థమో జరుగకముందే సంబంధిత యంత్రాంగం సరైన చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

### పట్టించుకునే వారు లేరు



కాల్వ నుంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేక పోతున్నాం. పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడి ఆసుపత్రి పాలైనా పట్టించుకునే దిక్కులేదు.

**ఎం. రామలక్ష్మి (స్థానికురాలు)**

### బావులూ పాడవుతున్నాయి



కాల్వలో నీరు మురుగుడుగా ఉండడం వల్ల ఈ ప్రాంతంలో ఉన్న తాగునీటి బావులు రెండు పాడయ్యే ప్రమాదం ఉంది. మా సమస్య పరిష్కారానికి అధికారులు ముందుకు రావాలి.

**విజయలక్ష్మి (స్థానికురాలు)**



పోల్‌రాజ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న మురుగు నీరు

# గుడ్లవల్లెరులో...

● **గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 6:** కౌతవరం పీహెచ్‌సీ వద్ద ఏపీ ఆశావర్కర్ల యూనియన్ పిలుపు మేరకు మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ హక్కులను నెరవేర్చడం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని ఆశావర్కర్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# దేవీయశస్వీకి అభినందనలు



దేవీయశస్వీకి సాయిచిత్రపటాన్ని అందజేస్తున్న రేణుసాయి గురూజీ

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 19:** కౌతవరం గ్రామానికి చెందిన పి.దేవీయశస్వీ చిన్నవయస్సులోనే కూచిపూడి నృత్య ప్రదర్శనలను దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకువస్తుందని సాయిసేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రేమ్‌సాయి(కెఆర్‌పీ) గురూజీ అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం సాయిసేవాట్రస్ట్ ధ్యానమందిరంలో దేవీయశస్వీని ఆయన సత్కరించి సాయిచిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో యశస్వీ తల్లిదండ్రులు గణేష్ దంపతులు పాల్గొన్నారు.

# ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ నేడు

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 20:** కౌతవరం 1వ వార్డులో బుధవారం ఉదయం తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ విబికెబి సుబ్బారావు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రావి వెంకటేశ్వరరావు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, ఎంపీపీ కొసరాజు విజయభారతి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కౌతవరం-1వార్డు ప్రజలు ఎన్నోఏళ్ల కల నెరవేరనుంది.

# నేత్ర పరీక్షలు



విద్యార్థినులకు నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 20:** స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వడ్లమన్నాడు, కౌతవరం, విన్నకోట గ్రామాల్లోని జడ్పీహైస్కూల్స్ లోని విద్యార్థులకు నేత్రవైద్య పరీక్షలను నిర్వహించారు. దేవినేని జోనికుమారి లయన్స్ ఐ హాస్పటల్ కొండపల్లివారి సౌజన్యంతో ఈ నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవినేని జోని కుమారి, లయన్స్ అధ్యక్షుడు ఎం.ఉమా శంకర్, ఎ.రామారావు, విశ్వేశ్వరరావు, వీర భద్రరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కౌతవరం స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

**మచిలీపట్నం-టౌన్ , ఫిబ్రవరి 21** : ఉపాధ్యాయురాలితో అసభ్య కరంగా మాట్లాడినందుకు స్కూల్ అసిస్టెంట్‌ను బుధవారం డీఈవో రాజ్యలక్ష్మి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం జడ్పీ హైస్కూలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నారాయణ రావును సస్పెండ్ చేశారు.

# నిరీక్షణ ఫలించబోతున్న శుభవేళ...

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 21:** కౌతవరం 1వార్డు ప్రజలకు ఏళ్లనాటి కల నెరవేరే సమయం ఆసన్నమైందని జడ్పీ వైస్ ఛైర్మన్ శాయిన పుష్పావతి అన్నారు. బుధవారం కౌతవరం 1వవార్డులో గ్రామపంచాయతీ రక్షిత తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు భూపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా ఈ వార్డు ప్రజలకు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ నిధులు రూ.40లక్షలు మంజూరు చేయించి అతి కొద్దిరోజుల్లో ఆప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలను పూర్తిగా తొలగించడం ఆనందంగా ఉందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ కొసరాజు విజయభారతి, ఎఎంసీ మాజీ ఛైర్మన్‌లు వల్లభనేని వెంకట్రావ్, కొసరాజు వెంకటాద్రి చౌదరి, జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్ వి.బి.కె.బి.సుబ్బారావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ మరీదు నాగలక్ష్మి,



శంకుస్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ వైస్ ఛైర్ పర్సన్, ఎంపీపీలు

మండల పార్టీ ఇన్‌చార్జ్ ఎ.రామ్మోహనరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, న్యాయవాది మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు

- కౌతవరంలో వ్యాయామ ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌కు నిరసన
- పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటారా.. అంటూ తల్లిదండ్రుల ఆగ్రహం
- సర్దిచెప్పి పంపిన పోలీసులు

**గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 22:** కౌతవరం వ్యాయామ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడంతో కౌతవరం గ్రామంలో హైడ్రామా నడిచింది. ఉపాధ్యాయుడికి మద్దతుగా విద్యార్థులు కొందరు ధర్నా చేయగా, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటారా అని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణకు, అదే పాఠశాలలో పని చేస్తున్న ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ మధ్య నెలకొన్న వివాదం సస్పెన్షన్ వరకు వెళ్లింది. ఫిబ్రవరి 2వ తేదీన హైస్కూల్ నుంచి హాకీ, అర్చరీ అకాడమీ సెలక్షన్స్ కోసం హైస్కూల్ నుంచి కొంతమంది విద్యార్థులను విజయవాడ తీసుకెళ్లిన విషయమై పీడీ నారాయణ, స్కూల్ అసిస్టెంట్ మధ్య వివాదం జరిగింది. ఉపాధ్యాయులు రాజీ చేసిన మీదట పీడీ నారాయణ క్షమాపణ చెప్పడంతో సమస్య సర్దుమణిగిందనుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఎంపీపీ విజయభారతికి ఫిర్యాదు చేయగా ఆమె జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌లకు తెలియజేశారు. డీఈవో కౌతవరం హైస్కూల్‌ను బుధవారం తనిఖీ చేసి ఉపాధ్యాయులందరినీ వేర్వేరుగా విచారించారు. అనంతరం మచిలీపట్నం వెళ్లి సస్పెన్షన్ ఉత్తర్వు జారీ చేశారు. పీడీపై అభిమానంతో కొందరు విద్యార్థులు రాస్తారోకోకు దిగారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం పాఠశాలలో ఉన్న తగాదాలకు విద్యార్థులను బలి చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. విద్యార్థులు రాస్తారోకో చేస్తుండగా తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని పిల్లలు ధర్నా చేయడం ఏమిటని ప్రశ్నించి పంపించేశారు. కొందరు తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటారా అని ఇన్‌చార్జి



ఇన్‌చార్జి హెచ్‌ఎం నళినీమోహన్‌తో మాట్లాడుతున్న ఏఎస్సై

హెచ్‌ఎం బి.వి.నళినిమోహన్‌ను ప్రశ్నించారు. గతంలో కూడా పీడీ విషయమై గొడవలు జరిగాయని తల్లిదండ్రులు ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సర్ది చెప్పి పంపించేశారు. ఎస్‌ఎంసీ మీటింగ్ నిర్వహించి ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని కోరనున్నట్టు హెచ్‌ఎం చెప్పారు.